క్లుప్తంగా

కార్మికుల ఐక్యతతో హక్కుల సాధన



గద్వాల అర్బన్: కార్మికుల ఐక్యతతో హక్కులు సాధించవచ్చని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, కోశాధికారి రాములు అన్నారు. మేడేను పురస్కరించుకొని వారం రోజుల పాటు సీఐటీయూ కార్మిక అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో విజేతలకు వారు బహుమతులను అందజేసి మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అంజి, శ్రీను, తిమ్మప్ప, వెంకటేష్, లక్ష్మీ, తులసీ, రాధమ్మ, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన నాయకులు



అలంపూర్: హైదరబాదులోని బీఎస్పీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నియోజకవర్గ బీఎస్పీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి సీఎం అభ్యర్థిగా ఆర్‌ఎస్‌ప్రవీణ్ కుమార్‌ను ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని ఆర్‌ఎస్పీ సూచించినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కనకం బాబు, ఉపాధ్యక్షుడు సుంకన్న, మండల కన్వీనర్ సురేష్, బూత్ అధ్యక్షుడు సుధాకర్, రాజు తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. శివలింగాన్ని అలంకరించారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా అందజేయాలి



అయిజ: బీఆర్ఏ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని దేశ పౌరులకు ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు భరత్, లక్ష్మణ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారి లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంపై అందరికి అవగాహన కోసం రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుంటే ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రాజు, సునిల్, సుధాకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్‌తో యువతకు మేలు



ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు మేలు జరుగనుందని, అందులో భాగంగానే ప్రియాంకగాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, రాష్ట్ర నాయకులు కె.ప్రశాంత్ కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన విద్యార్థి, నిరుద్యోగ జంగ్‌సైరన్ సభకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, తులసీరాజ్, రహ్మతుల్లా, మహేందర్‌రెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయవర్ధన్‌రెడ్డి, గంధం రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు అధ్వానం



నెట్టెంపాడు - ద్యాగదొడ్డి గ్రామాల మధ్య ప్రమాదభరితంగా బీటీ రోడ్డు

- మోకాల్లోతు గుంతలు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మన్నాపురం-చింతరేవుల గ్రామాల మధ్య రోడ్డు

ధరూరు: మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయ్యారయ్యాయి. రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ రోడ్లు మెరుగయ్యాయని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయిలో ఉన్న రోడ్లకు పొంతన లేకుండా ఉంది. కొన్ని చోట్ల వాహనదారులు ప్రయాణించాలంటేనే వెనకడుగు వేయాల్సిన దుస్థితి నెలకొందంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయొచ్చు. ఇటీవల కురిసిన అకాల వర్షాలక రోడ్లు మరింత దెబ్బతిన్నాయని పలుగ్రామాల ప్రజలు వాపోయారు. కోతకు గురైనా అధికారులు మరమ్మతు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా ప్రధాన రహదారులు

మండలంలో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. ధరూరు – గట్టు వెళ్లే మార్గంలో మార్లబీడు వరకు రహదారి అధ్వానంగా ఉంది. ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడం..రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి ఉందని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మీదుగా మక్తల్, నారాయణపేట, ఆత్మకూరు, దేవరకద్ర, తదితర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. జూరాల ప్రాజెక్టు ఇవతల రేవులపల్లి, నర్సన్‌దొడ్డి చౌరస్తా, చింతరేవుల తదితర గ్రామాల మీదుగా ఉన్న బీటీ రోడ్డు ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఒక్కో గుంత వద్ద మోకాల్లోతు వరకు గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారి గుండా ప్రయాణించే కార్లు చాలావరకు ప్రమాదాలబారిన పడుతున్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతు చేపడతాం..

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు అయిన వెంటనే రహదారులకు మరమ్మతు చేపడుతాం. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించాం. తాత్కలికంగా పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించాం.

– జుబేర్ అహ్మద్, ఈఈ, పీజేపీ

పట్టించుకోని అధికారులు...

రోడ్ల మరమ్మతుకు పీజేపీ అధికారులు పట్టించుకవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూరాల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు నుంచి జూరాల ప్రాజెక్టు వరకు ఉన్న ప్రధాన రోడ్డు నిర్వహణ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉంది. రహదారులపై గుంతలు ఏర్పడినా ఆ శాఖ అధికారులు కనీస మరమ్మతు చేయడం విమర్శలు వినిపిస్తున్నాయి.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



తక్కశిలలో ఎద్దుల బలప్రదర్శనలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎద్దులు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో బండలాగుడు పోటీలు సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎద్దులు బలప్రదర్శనలో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. మొత్తం 9 జతలు ఎద్దులు బలప్రదర్శనలో పాల్గొన్నాయి. మొదటి విజేతగా కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా, ఫల్కందొడ్డి గ్రామానికి చెందిన ఖాజహుస్సేన్ ఎద్దులు నిలిచాయి. విజేతకు రూ.50 వేలు అందజేశారు. నాగర్ కర్నూల్ జిల్లాకు, సింగవరంకు చెందిన ఎద్దులు రెండో స్థానంలో నిలువగా రూ.40 వేలు అందజేశారు. అదేవిధంగా మూడు, నాలుగు, ఐదు స్థానాలలో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

కేటీదొడ్డి: హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటికీ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన్న, మండల ఇన్‌చార్జ్ జంబయ్య, కర్రెప్ప, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు వినోద్, ఆశన్న, చెన్నయ్య, అయ్యన్న, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని బూరెడ్డిపల్లి, ధరూరు, అల్వలపాడు, మార్లబీడు, చెన్నారెడ్డిపల్లి, జాంపల్లి తదితర గ్రామాల్లో బీజేపీకి హఠావ్.. దేశ్‌కో బచావ్‌లో భాగంగా సోమవారం సీపీఐ నాయకులు ఇంటింటి ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి అంజనేయులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడంతో సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన్న, కేటీదొడ్డి మండల ఇన్‌చార్జ్ జంబయ్య, ధరూరు మండల ఇన్‌చార్జ్ కర్రెప్ప, జిల్లా నాయకులు ఆశన్న, చెన్నయ్య, అయ్యన్న, ప్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా ఇంటింటికి సీపీఐ సోమవారం పెద్దపల్లి, బూడిదపాడు, అమరవాయి, బిజ్వారం, ఉలిగేపల్లి, దాసర్‌పల్లి గ్రామాలలో నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాలలో కళాజాతా బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, రంగన్న, పెద్దబాబు, ఆశన్న, చెన్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



గర్భిణులకు కేసీఆర్ కిట్లను అందిస్తున్న ఎంపీపీ అశోక్‌రెడ్డి

మానవపాడు: మండలకేంద్రంలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను సోమవారం లబ్దిదారులకు ఎంపీపీ అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కిట్లను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరుచుగా తాజా ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గర్భిణులు పాల్గొన్నారు.

రాళ్లు ఇలా.. నీరు పారేది ఎలా?



జూరాల ప్రధాన కాల్వ బ్రిడ్జి కింద పడిన రాళ్లు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని గురుదత్త దాబా వెనకాల జూరాల ప్రధాన కాల్వపై ఉన్న బ్రిడ్జి కింద రాళ్లు వేయడంతో దిగువ ప్రాంతానికి నీళ్లు ఎలా పారుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములకు రైతులు, మత్స్య కళాశాలకు విద్యార్థులు ప్రతి రోజు జూరాల కాల్వపై ఉన్న ఈ బ్రిడ్జినే దాటి వెళ్తుంటారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. జూరాల కాల్వలను పరిశీలించే అధికారులు ఇటు వైపు కూడా రాకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో దానికి మరమ్మతు చేయకపోతే వచ్చే వర్షాకాలంలో దిగువ ప్రాంతాలకు సాగునీరు పోయేందుకు ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూరాల ప్రధాన కాల్వ మరమ్మతు చేయాలని పలువురు రైతులు కోరారు.

బతుకమ్మ ఆడి జేపీఎస్‌ల నిరసన



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె 11వ రోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా జేపీఎస్‌లు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం తెలిపారు. జేపీఎస్‌ల ప్రొబేషనరీ కాలాన్ని సరీ్వస్‌గా పరిగణించాలని, అర్హులైన కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు పాండు, నిరంజన్, శేఖర్, రమేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్

అయిజ: క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కన్వీనర్ స్వాములు అన్నారు. సోమవారం స్వేరోస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. మొత్తం 82 టీంలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయన్నారు. 10 రోజులపాటు టోర్నమెంట్ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్, లీగ్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, పీఈటీలు సుబ్బన్న, సూర్య ప్రభాకర్, చంటి, స్వేరోస్ నాయకులు భీసన్న, ప్రశాంత్, సూరి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 586, 587లోని దుంపాయికుంటలో నిరుపేదలకు ఇంటి నిర్మాణాల కోసం ఇచ్చిన స్థలం పట్టాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వేస్లీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్‌తో కలిసి మక్తల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సోమవారం సీపీఎం నాయకుల బృందం వెళ్లారు ఎమ్మెల్యేను కలిశారు. 1997లో దుంపాయికుంటలో నిరుపేదలకు ఇంటి స్థలాల కోసం పట్టాలను అందించారన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు తమకు అందించిన పట్టాల ప్రకారం స్థలం పొజీషన్లు చూపాలంటూ ఎనిమిది నెలలుగా గుడిసెలు నిర్మించుకుని అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఎం సీనియర్ నాయకుడు మహమూద్, మండల కార్యదర్శి జీఎస్ గోపి, వెంకటేష్, ఆర్‌ఎన్ రమేష్, అజయ్, బుచ్చన్న, పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



కురవ కమ్యూనిటీ సభ్యులకు మంజూరు కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి: సబ్బండ వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని పెద్ద ధన్వాడలో కురవ కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణం కోసం మంజూరైన రూ.5 లక్షల సీడీపీ నిధుల కాపీని కురవ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని కులాలు, మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దేశానికే తెలంగాణ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్ మాజీ చైర్మన్ సీతారామి రెడ్డి, అజయ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవుదాం



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ



మానవపాడు సాధారణ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌రెడ్డి

మానవపాడు: గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవుదామని ఎంపీపీ అశోక్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అనంతరం కొర్విపాడు, జల్లాపురం గ్రామాలలో మిషన్‌భగీరథ నీరు రావడం లేదని సర్పంచ్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ సోమన్నగౌడ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని వివరించారు. గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాలేదని పలువురు ప్రజాప్రతినిధుల సభలో లేవనెత్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో నకిలీ విత్తనాలు విక్రయించకుండా ముందుజాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం, విద్యుత్, విద్య, రెవెన్యూ, తదితర సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, వైస్‌ఎంపీపీ సోమన్నగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా, మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే పల్లెల ప్రగతి

కేటీదొడ్డి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే పల్లెల ప్రగతి సాధ్యమని ఎంపీపీ మనోరమ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ మనోరమ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు తిష్ఠవేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని సొంపురం సర్పంచ్ తిక్కన్న కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, తహసీల్దార్ సుందర్‌రాజు, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఏఓ మహాలక్ష్మి, ఎంఈఓ సురేష్, జెడ్పీటీసీ రాజశేఖర్, సర్పంచ్‌లు సువర్ణమ్మ, తిక్కన్న, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



కొర్విపాడులో కంటివెలుగును శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు,



ఉండవెల్లిలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ రేఖ

మానవపాడు: మండలంలోని కొర్విపాడులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ శ్రీనివాసులు, డాక్టర్ యాకుబ్‌బాషాలు ప్రారంభించారు. 176 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 25 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, 35 మందికి కంటి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమతారెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వైద్యసిబ్బంది చంద్రన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, రాణి, ఆశలు, పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రేఖ ప్రారంభించారు. 182 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసి రాజశేఖర్, ఉప సర్పంచ్ సయ్యద్ రెహ్మాన్, ఎంపీఓ పద్మావతి, ఎంపీహెచ్ఓ సత్యానారాయణ, మండల కోఆప్షన్ మెంబర్ చిన్న బాస్‌మియ్యా, వైద్యులు వీణశ్రీ, ఏఎన్‌ఎం షాజహాన్ పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సు, బల్గెర, ఇందువాసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరంలో సోమవారం మూడు గ్రామాలు కలిసి 410 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 24 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 25 మందికి కంటి అద్దాల కోసం ప్రతి పాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సౌజన్య, నర్సింహులు, హెల్త్ సూపర్‌వైజర్లు మక్బూద్, స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు రేష్మ, ఈశ్వరమ్మ, ఖేజియా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న వీవీ నర్సింహా



మల్దకల్‌లో సమ్మె చేస్తున్న వీఓఏలు

గద్వాల అర్బన్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో టీఎన్‌జీవో భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీవీ నర్సింహా మాట్లాడుతూ వీఓఏలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, సాధారణ, ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, ఆయా సంఘాల నాయకులు పద్మ, మోహనమ్మ, గట్టన్న, శ్రీను, తిమ్మప్ప, రాధమ్మ, తులసీ, వెంకటేష్, మహిళ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు మాట్లాడుతూ ప్రభుత్వం వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఓఏల సంఘం నాయకులు శంకరయ్యగౌడ్, గోవిందు, హనుమంతు, కృష్ణ, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఏస్తేర్, తిరుమలేష్, జనార్ధన్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



షేకుపల్లి వద్ద కల్వర్టుపై గుంతలు



సాసనూలు వద్ద..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో పలు కల్వర్టులు కూలిపోయి ప్రమాదభరితంగా మారాయి. ఎర్రవల్లి నుంచి ఆర్. గార్లపాడు వెళ్లే దారి గుండా పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామస్తులు ఈ మార్గం గుండా వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. కల్వర్టులపై వాహనదారులు ప్రమాదాలబారిన పడిన ఘటనలు ఉన్నాయి. గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి గ్రామాల సమీపంలో ఉన్న కల్వర్టులు కూలిపోయినా అక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కు బిక్కుమంటూ నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిన కల్వర్టులకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.